## క్లుప్తంగా

### సర్మస్ హుసేనీ్స దర్గాలో ఫాతేహాలు



అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు సర్మస్ హుసేనీ్స స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

### పేదల పాలిట వరం 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మల్లీశ్వరి

బొమ్మనహాళ్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదల పాలిట వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి మల్లిశ్వరీ అన్నారు. గురువారం మండలంలోని దేవగిరి సచివాలయ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 55 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, విజయలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### గర్భిణులకు అన్నదానం



గర్భిణులకు అన్నదానం చేస్తున్న ఎస్‌ఐ

కూడేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రధాన మంత్రి సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు హెల్త్ క్లినిక్ నిర్వహించారు. వైద్యులు హైరిస్కు గర్భిణుల గుర్తించి సుఖప్రసవం జరగడానికి పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. హెల్త్ క్లినిక్‌కు వచ్చిన గర్భిణులకు ఎస్‌ఐ సత్యనారాయణ అన్నదానం చేసి దాతృత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు మోహన్‌బాబు, వరలక్ష్మి, సూపర్‌వైజర్లు రవీంద్ర, వెంకటలక్ష్మమ్మ, ఎంపీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

ఉరవకొండ: పట్టణ శివారులోని మార్కెట్ యార్డు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో గురువారం రాత్రి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వివరాల మేరకు.. గుంతకల్లు బెంచి కొట్టాలకు చెందిన రుద్రప్ప, కృష్ణ ఉరవకొండలో పనుల నిమిత్తం వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో ఆటో బోల్తా పడింది. క్షతగాత్రులను హుటాహుటినా ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

### ఆధార్ సేవలు విస్తరింపజేస్తున్నాం



సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ బాలాజీ

కళ్యాణదుర్గం రూరల్: ప్రతి సచివాలయంలోను ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి సేవలను మరింత విస్తరింపజేస్తున్నామని ఎంపీడీఓ బాలాజీ తెలిపారు. మండలంలోని గోళ్ల గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో గోళ్ల సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆధార్ కేంద్రం నిర్వహణకు అవసరమైన పరికరాలపై డిజిటల్ అసిస్టెంట్‌తో ఆరాతీశారు.అనంతరం గ్రామంలో జరుగుతున్న సస్టేనబుల్ డెవలప్ గోల్ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్



రాయదుర్గం రూరల్: మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు కళ్యాణదుర్గం వచ్చి పోటీ చేసినా మరోసారి వైసీపీ జెండా ఎగురుతుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పునరుద్ఘాటించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీలు అందించని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. పార్టీలు చూడకుండా, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కళ్యాణదుర్గంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను అందించామన్నారు. ఇది టీడీపీ వారు ఓర్వలేక తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తనను ఎవరు ఎక్కువ తిడితే వారికే టికెట్లు ఇస్తామన్న అధినేత చంద్రబాబు సూచన మేరకు బీసీ మంత్రి అయిన తనపై నిందారోపణలు చేస్తూ టీడీపీ నాయకులు పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. తనపై వచ్చిన ఆరోపణలు రుజువు చేయాలని సవాల్ విసిరినా...టీడీపీ వారు నోరు మెదపడం లేదని విమర్శించారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో సంక్షేమ పథకాలను దోచుకుతిన్నారని దుయ్యబట్టారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. సీఎం జగన్ అంటే ఒక నమ్మకమని... మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి మనందరం కృషి చేయాలని సూచించారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు, లోగోలను ఆవిష్కరించారు. బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండల కన్వీనర్లు బసవరాజు, భాస్కర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు చంద్రశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, జెడ్పీటీసీలు ప్రభావతి, బొమ్మన్న, ఎంపీపీ మారుతమ్మ, డీసీసీబీ డైరెక్టర్ రామాంజనేయులు, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వలంటీర్లతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పార్టీకి రథసారథులు మీరే ...**

రాయదుర్గం రూరల్: ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు , గృహసారథులే పార్టీ విజయానికి రథసారథులని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని 74 ఉడేగోళం మద్దానేశ్వర స్వామి కళ్యాణమండపంలో గురువారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా గృహసారథుల ఆయన దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలతో పాటు ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఐకమత్యంతో శ్రమించి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. గత టీడీపీ హయాంలో అందిన సంక్షేమ పథకాలు, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదం ప్రతి గడపకూ చేరాలన్నారు. మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒకవైపు చంద్రబాబు చేసిన అప్పులు చెల్లిస్తూనే మరోవైపు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. జగనన్న ఉంటేనే సంక్షేమ పథకాలు అందుతాయని, టీడీపీ అధికారంలోకి వస్తే పథకాలు నిలిపేస్తారని ప్రతి గడపలోనూ తెలియజేయాలన్నారు. టీడీపీ జాతీయ కార్యదర్శి పప్పుగుత్తి (లోకేష్) చేసే పాదయాత్ర వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. పచ్చ కుక్కల పిచ్చి కూతలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు తెలియజేయాలన్నారు. అధికారంలోకి రావాలనే టీడీపీ నాయకుల ప్రయాస వృథాయే అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, జెడ్పీటీసీ, మండల కన్వీనర్ హొన్నే మల్లికార్జున, ఎంపీపీ విద్యావతి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు దిలావరుల్లా సాబ్ , మండల సచివాలయ కన్వీనర్ ధనుంజయయాదవ్, కొండాపురం సొసైటీ అధ్యక్షుడు గౌని లక్ష్మీరెడ్డి, నాయకులు బోర్ వెల్ నాగిరెడ్డి, శివారెడ్డి, ఆర్డీ కాంతారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ఉపాధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ అనురాధ

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషాతో కలిసి ఉపాధి సిబ్బందితో డ్వామా ఏపీడీ అనురాధ ఉపాధి పనుల కల్పనపై సమీక్ష నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ మండలంలో రోజుకు 3వేల మందికి పని కల్పించేలా లక్ష్యం నిర్దేశించామన్నారు. పనుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. గుర్తించిన పనులపై గ్రామసభలు నిర్వహించి కూలీలకు అవగాహన కల్పించి, పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బిల్లులు సకాలంలో అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## 'ఉపాధి'లో అక్రమాలకు చోటివ్వకండి



మాట్లాడుతున్న ఏపీడీ వెంకటేష్‌నాయక్

వజ్రకరూరు: ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలుత తీసుకుంటామని ఏపీఓ వెంకటేష్‌నాయక్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో పనులపై సమీక్ష నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. పనుల్లో అక్రమాలకు తావు ఇవ్వకూడదని, అక్రమాలను ప్రోత్సహించినవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసీ ప్రభాకర్ టీఏలు హరి, శివ, చంద్రానాయక్, కిష్టప్ప, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పెద్దముస్టూరులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జగనన్నతోడు లబ్ధిదారులు, మాజీ ఎమ్మెల్యే

ఉరవకొండ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్దముస్టూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ దీవెనమ్మ, నాయకులు ఓబయ్య, వెంకటేష్, గోవిందు, వన్నూర్‌స్వామి, మారెప్ప, చంద్ర తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా ఎంత మేర లబ్ధి పొందారో బుక్‌లెట్ అందజేశారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులు, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, పార్టీ రాష్ట్ర నాయకులు అశోక్, తేజోనాథ్, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, ఇంద్రావతి, మోపిడి సర్పంచ్ సిద్దార్థ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**'జగనన్న తోడు'తో చేతి వృత్తుల వారికి భరోసా**

'జగనన్న తోడు'తో చేతివృత్తుల వారి ఖాతాల్లో వరుసగా మూడో ఏడాది రూ.10 వేలు జమ చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారని మాజీ ఎమ్మెల్యే అన్నారు. గురువారం మండలంలోని పెద్ద ముస్టూరు గ్రామంలో 'జగనన్న తోడు' కింద లబ్ధి పొందిన నాయీబ్రాహ్మణులు, టైలర్లు తదితర చేతివృత్తుల వారు సీఎం చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యేతో కలసి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఉరవకొండ పట్టణాభివృద్ధే లక్ష్యం



పట్టణంలో హైమాస్ లైట్ల నిర్మాణానికి పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: పట్టణంలో మౌలిక వసతులు కల్పించి, మరింత అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని కవితా హోటల్ సర్కిల్ వద్ద రూ.10 లక్షల నిధులతో అధునాతన హైమాస్ లైట్లు ఏర్పాటుకు సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, పాలకవర్గ సభ్యులతో కలిసి మాజీ ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉరవకొండ పట్టణ సుందరీకరణలో భాగంగా వైఎస్సార్ సర్కిల్, బైపాస్, కణేకల్లు క్రాస్ తదితర ప్రాంతాల్లో హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే రూ.5 కోట్లతో పట్టణంలోని సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే రూ.3 కోట్ల వ్యయంతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ ఓబుళేసు, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతమ్మ, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు మీరంబాషా, నాయకులు బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, పంచాయతీ ఈఓ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం



ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రెండోసారి ఎంపికైన మాధవను సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రెండోసారి ఎంపికైన జె.మాధవను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో రాయదుర్గం, కళ్యాణదుర్గం, కణేకల్, కంబదూరు తాలూకాల ఎన్జీఓల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌తో కలిసి మాధవ మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల హక్కుల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో రెండోసారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి కార్మికుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయి మొత్తాలన్నింటినీ సకాలంలో అందించాలని సూచించారు. అనంతరం ఉద్యోగులు మాధవను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం కళ్యాణదుర్గం చైర్మెన్ చెన్నారెడ్డి, జిల్లా నాయకులు కుళ్ళాయి స్వామి, బషీర్, రవికుమార్, శ్రీధర్, లక్ష్మిదేవి, జబిరా బేగం, జైనుబీ, వెంకటరమణ, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.36 వేలకు బండిమోటు వేలం



ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బండిమోటు వేలం వేస్తున్న అధికారులు

రాయదుర్గం రూరల్: మండలంలోని మద్దానేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం, పశువుల జాతర ఈనెల 21 నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా స్థానిక దేవాలయంలో గురువారం పర్యవేక్షణాధికారిణి రామతులసి ఆధ్వర్యంలో బండిమోటు వేలం నిర్వహించారు. మార్చి 1 వరకూ జరిగే పశువుల జాతరలో సుంకం వసూలు చేసుకోవడానికి వేసిన బహిరంగ వేలంలో గ్రామానికి చెందిన లింగన్న రూ.36 వేలకు వేలం ద్వారా దక్కించుకున్నట్లు ఎండోమెంట్ అధికారి కె.నరసింహారెడ్డి తెలిపారు. గత ఏడాది బండిమోటు వేలం ద్వారా దేవదాయశాఖకు రూ.33,500 వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు బసవరాజు, సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# పోలింగ్ స్టేషన్ల పరిశీలన



కళ్యాణదుర్గం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



వజ్రకరూరు: పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

కళ్యాణదుర్గం: ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కళ్యాణదుర్గంలో ఎంపిక చేసిన రెండు ఎన్నికల పోలింగ్ కేంద్రాలను గురువారం సాయంత్రం ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ బాలాజీ, ఎన్నికల డీటీ వెంకటేష్ , ఏఎస్‌ఐ నారాయణరెడ్డి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. గదుల నిర్వహణ, పోలింగ్‌కు అనుకూలమైన వసతులు వంటి వాటిపై క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

వజ్రకరూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ అనిల్‌కుమార్ పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో గురువారం వజ్రకరూరులో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ల (167,72)ను ఆయన పరిశీలించి, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ నెల 16న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. హెచ్‌ఎం నాగేంద్రప్ప, వీఆర్‌ఓ సుబ్బారావు, సీఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ మరమ్మతుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ మరమ్మతును గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి సరఫరాను పునరుద్ధరించాలని ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని వాల్మీకినగర్‌లో తాగునీటి కొరత నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి ఇబ్బందులు తీర్చాలని బుధవారం కాలనీవాసులు ఆందోళన చేపట్టగా కాలనీలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, వార్డు కౌన్సిలర్ కొంతం దేవరాజుతో కలిసి ఆమె పర్యటించారు. బోరు వేయించి నీటి సమస్య పరిష్కరిస్తామని కాలనీవాసులకు భరోసా కల్పించడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈ రామ్మూర్తి, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వెట్టి చాకిరి విధానం నిర్మూలిద్దాం



కళ్యాణదుర్గం: టీ సర్కిల్‌లో మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు



రాయదుర్గం టౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

కళ్యాణదుర్గం: వెట్టి చాకిరీ విధానాన్ని పూర్తిగా నిర్మూలిద్దామని...ప్రతి వ్యక్తికీ స్వాతంత్ర్యాన్ని పరిరక్షిద్దామని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం వెట్టి చాకిరి పని విధానం నిర్మూలనపై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ వెట్టి చాకిరి విధానం నిర్మూలించేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా పలు అవగాహన చిత్రాలను ప్రదర్శించారు. వెట్టి చాకిరి పరిస్థితులు తెలిస్తే వెంటనే జిల్లా కలెక్టర్ స్థాయి నుంచి మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసులు, తేజమూర్తి, ఎస్‌ఐలు నాగమధు, ఆశాబేగం, పోలీసు సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బిక్కి హరి, షేక్షావలి, నరేష్, విశ్రాంత ప్రిన్సిపాల్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

**రాయదుర్గంలో..**

రాయదుర్గంటౌన్: వెట్టి చాకిరి వ్యవస్థలను శాశ్వతంగా రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐ యుగంధర్, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పోలీసులు, మున్సిపల్, ఐసీడీఎస్ అధికారులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వెట్టిచాకిరి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ సుమన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఉపాధ్యాయులు నాగభూషణం, రామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**గృహసారథులు, కన్వీనర్ల సమావేశం రేపు**

కూడేరు: స్థానిక శివరావు ఫంక్షన్ హాల్‌లో శనివారం మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించనున్నట్లు సచివాలయాల మండల కన్వీనర్ దేవేంద్ర గురువారం తెలిపారు. సమావేశానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్లు ఆయన తెలిపారు. కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

**14న మారెమ్మ విగ్రహ ప్రతిష్ట**

గుమ్మఘట్ట: మండలంలోని ఎస్.గుండ్లపల్లిలో గాలి మారెమ్మ దేవత ఆలయంలో ఈ నెల 14న నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు గురువారం తెలిపారు. 13వతేదీ అమ్మవారి విగ్రహం ఊరేగింపు, గంగపూజ, పుణ్యాహవాచనం,14 వతేదీ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

**నేడు అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశం**

వజ్రకరూరు: మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం మండల స్థాయి అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించనున్నట్లు ఏఓ శ్రీనివాస్ గురువారం తెలిపారు. సమావేశంలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, సేవల గురించి చర్చిస్తామన్నారు. సమావేశానికి అగ్రి అడ్వైజరీ బోర్డు సభ్యులు, రైతులు హాజరు కావాలని కోరారు.

**విద్యుత్ సరఫరా చేయండి**

కూడేరు: మండలంలోని మరుట్ల విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని మరుట్ల-1, 2, 3 కాలనీలు, ఉదిరిపికొండ గ్రామానికి ఐదు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆయా గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు గురువారం సమస్యను వివరించారు. విద్యుత్ సరఫరా కాక పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించి విద్యుత్ సరఫరా చేయాలని వారు కోరారు.

**'ఎగువభద్ర' నిర్మాణం ఉపసంహరించుకోవాలి**

రాయదుర్గంటౌన్: కర్ణాటకలో ఎగువభద్ర ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగార్జున డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీపీఐ నాయకులు మాట్లాడారు. ఎగువ భద్ర ప్రాజెక్ట్ జరిగితే అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లో సాగునీటితోపాటు తాగునీరు సైతం అందని పరిస్థితులు తలెత్తుతాయన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాయలసీమకు అన్యాయం జరగకుండా క్షేత్రస్థాయిలో తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం పట్టణ కార్యదర్శి తిప్పేస్వామి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సీపీఐ పట్టణ కార్యదర్శిగా కొట్రేష్**

రాయదుర్గంటౌన్: సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగార్జున ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శి, సహాయ కార్యదర్శులను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా కొట్రేష్, సహాయ కార్యదర్శులుగా నరసింహులు, ఆయేష ఎన్నికయ్యారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో చేస్తామని వారు తెలిపారు.